సూరి గొంతు తడారిపోయింది.

"నాకు జవాబు కావాలి సూరీ. నాకు నిజంగా స్నేహితుడివే అయితే నువ్వు నిజం చెప్పాలి."

ఏ సంఘటనతో విశ్వ యిలాంటి మార్పుకి గురైనా కాని తన గురించి అతడే మనుకున్నా రేపు చౌదరి మూలంగా తనకి హాని జరిగినా కాని యిక పెదవి విప్పక తప్పదు.

"అదొక్కటే కాదు విశ్వా" సూరి కళ్ళలోనూ యిప్పుడు నీళ్ళు తిరిగుతున్నాయి. "ఆ రోజు క్విజ్ పోటీలో అమ్మని కిడ్నాప్ చేయించిందీ చౌదరీయే."

విశ్వ షాక్ తిన్నట్టుగా చూసాడు. ఆమె ఓడితే పోగొట్టుకోవాల్సిన శీలంకోసం కృషే ఆ పని చేయించిందని తను నమ్మేడు. కాదు చౌదరి నమ్మించాడు.

"ఎందుకీ విషయం దాచావ్"

"నీతో నిజం చెబితే అమ్మ ప్రాణాలకి హాని తలపెడతానని చౌదరి బెదిరించాడు కాబట్టి.... అసలు నీ ఓటమి కోరింది కృషి కాదు విశ్వా. . . చౌదరి ఐదు లక్షల అప్పుతో నిన్ను రుణగ్రస్తుడ్ని చేసి మానసికంగా శారీరకంగా హింసించి ఆమెను ఈ దేశం నుంచి పంపించడమే చౌదరి లక్ష్యం."

ఆ రాత్రి నిద్రపోలేదు విశ్వ.

ఎన్ని సార్లు యెన్ని విధాలుగా కృషిని అవమానించిందీ మానసికంగా హింసించిందీ గుర్తుకొచ్చి బిడియంగా కదిలిపోయాడు.

నిజానికి తనకున్న కక్ష ఉపాధ్యాయపై. అది సాధించడానికి ఓ మార్గం కావాలి. ఉపాధ్యాయ స్థాయి వ్యక్తికి చేరువ కావాలి అంటే కృషితో పరిచయం తప్పనిసరైంది.

తెలతెలవారుతుండగా నిశ్చయించుకున్నాడు. ఇప్పుడు తన ప్రత్యర్థి ఉపాధ్యాయ ఒక్కడే కాక చౌదరి కూడా అని. . . అసలు తన తండ్రి మరణానికి కారకులు ఖచ్చితంగా ఎవరైనా గాని యిక ముందు తనకు తానే ముఖా ముఖీ పోరాటానికి సిద్ధపడాలి తప్ప కృషిని డిస్టర్బ్ చేయడు. . . అసలు ఆమెను ఇక ఎప్పటికీ కలుసుకోకూడదు. . .

దృఢంగా తీసుకున్న నిర్ణయం అది.

0 0 0

"మిస్ కృషి . . . మాటలతో, చేతలతో హింసించడమే అలవాటైన ఈ మనిషి యింత ఒద్దికగా ఉత్తరం రాస్తున్నాడేమిటి అని ఆశ్చర్యపోతున్నారా. . . దుర్మార్గుల జీవితాల్లోనూ కొన్ని దివ్య క్షణాలుండడం నిజమైతే అలాంటి క్షణమే నా జీవితంలో మీ పరిచయం.

మేధస్సు పరంగా ఏ కొద్దిగానో నేను ఎదిగినా నాది చాలా చిన్న ప్రపంచం కృషి... అందుకే చిన్న పొదిరింటిలో పుట్టిన నేను అమ్మా, నాన్నల ఆశయాల మేరకు ఎదగాలని అహోరాత్రులు శ్రమించి ఎదగటానికి అకుంఠిత దీక్షతో కృషి చేశాను. కొద్దిగా ఎదిగానేమో

పొదరింటిలో నేను ఒంటరి వాడ్నయిపోయాను. . . ఆ తర్వాత దురదృష్టవశాత్తూ కక్ష తీర్చుకోవడమే జీవిత ధ్యేయమైంది. అందుకు తొలిమెట్టుగా మీ పరిచయాన్ని పెంచుకున్నాను..... ఇప్పుడు నాకు పూర్తిగా జ్ఞానోదయమైందని చెప్పడం లేదు కృషి . . . నా తండ్రి హత్యలో చౌదరి భాగస్వామే అని అణువంతైనా అర్థం చేసుకున్నాను. . . అంటే లక్ష్యం కొంత మారింది తప్ప పగ తీర్చుకోవాలనే ఆలోచన మాత్రం విరమించుకోవడం లేదు. . .

ఈ క్షణంలో మీకు క్షమార్పణ చెప్పుకోవటం తప్పు కాదు. ఇంకా ఆరని భాస్వర స్వప్నాల మధ్య నిలబడి నిన్న చచ్చిపోయిన బ్రతుకు పచ్చదనాల గురించి ఆలోచించే నేను మీకు మళ్ళీ కలవను. కలిసి ఆరడిపెట్టను . . .

మీ పరిచయం వాన కౌగిటి అంత స్వచ్ఛదనాన్ని అందించినా దాన్ని విస్మరించి వరద గోదావరిలో కొట్టుకుపోవటానికే సిద్ధపడుతున్నాను. నా పిడికెడు చీకటి గుండెల్లో ఆరని ఆశల దివ్వెల్ని రగిల్చిన మీ పరిచయాల అక్షర జ్యోతుల్ని నేను రాలిపోయే దాకా గుర్తుంచుకుంటాను. నేననుకునే కథ సుఖాంతం కాకపోయినా ప్రత్యర్థుల అశుభం దాకా ఒంటరిగా పోరాడుతూనే వుంటాను. . .

ఎందుకు ఇంకా నేను ఇలానే ఆలోచిస్తున్నానూ అంటే అశోకంలా ఎంత నిటారుగా పెరిగితే మాత్రం ఏం లాభం ఎప్పుడో ఒకనాడు విరిగి పోవాలిగా. గరికనైతే చాలదూ. . . గాలివాటుకి గాయపడినట్టు తలవాల్చినా విడవకుండా మళ్ళీ తలెత్తుకుని సాధించానన్న సంతృప్తితో కడతేరిపోవచ్చు. సమస్యల వరదల బీభత్సంలో కొట్టుకుపోతున్న నేను బ్రతుకు కెరటాల కొరడా దెబ్బలకి కలత చెంది ఏ క్షణాన్నైనా మిమ్మల్ని బాధ పెడితే క్షమించమని మరో మారు అర్థిస్తూ శలవు తీసుకుంటున్నాను.

నన్ను మన్నిస్తారు కదూ. . .
క్షమార్హుడ్ని అవునో కాదో తెలీని
విశ్వ . . . ”

ఆమూలాగ్రం చాలా ఏకాగ్రతగా ఉత్తరాన్ని చదివిన కృషి కొన్నిక్షణాల దాకా బెడ్‌పై పడుకుని ఆలోచిస్తూ వుండిపోయింది. . .

ఆ ఉత్తరాన్ని సూరి తెచ్చిచ్చింది గంట క్రితం. . .

ఇప్పటికి చాలా సార్లు చదివింది. . .

పెదవులే విచ్చుకున్నాయో లేక మనోగ్రహాంతరాల్లో అరమరికలు చెరిగిన బాలికల్లా వూసుల గుస గుసల్తో గుండె చప్పుళ్ళే ఆమెను వివశత్వానికి గురిచేసాయో పైకి లేచింది చప్పుడు చెయ్యని శబ్ద కిరణానికి తను అందించే సజీవ ఆహ్వానంలా ఆశ్రమానికి బయలుదేరింది.

ఇంత కాలమూ ఏమైనా గాని విశ్వ ఇప్పుడు మనస్సుని పూర్తిగా ఆక్రమించుకుని ఆమె [illegible]

మస్తిష్కపు వాకిలి తెరిచి ఆలోచనల పొరల వెనుక అతడికోసం ఏర్పరచిన నిద్రా రంగస్థలంపై అతడు కొంత విశ్రమిస్తే తప్ప తన సంగ్రామపు చివరి ఘట్టానికి తనూ అతడికి తోడు కాలేదు. . .

ఆశ్రమానికి వెళ్ళింది కాని విశ్శు లేడు.

ఉదయమే వెళ్ళిపోయాడని తెలిసింది. . .

అప్పుడు భయపడింది విశ్శు గురించి తొలిసారి.

0 0 0

"ఏమిటి డల్‌గా వున్నావ్" విశ్శుని చూస్తూ అడిగాడు చౌదరి.

హాల్లో అప్పటికే చాలా సందడిగా వుంది. . . అదంతా రేపు నెలలో కేంద్రమంత్రిగారి కూతురితో రాజేంద్రకి జరగబోయే పెళ్ళి సందడిలా వుంది తప్ప నిన్న జరిగిన ఓ దారుణానికి సంబంధించి జరుగుతున్న చర్చలా లేదు. .

"బహుశా నిన్నటి షాక్ నుంచి విశ్శు ఇంకా తేరుకున్నట్టులేదు" అన్నాడు లాయర్ రంగధాం అదో జోకులా....

మరెక్కడో జీవిత యింటిలో బహుశా ఈపాటికి జీవిత శవానికి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయమది.

"కరెక్టుగా గెస్ చేసారు లాయరుగారూ. . ." నిర్వేదంగా అన్న విశ్శూ మొహంలో ఆ బాధ పూర్తిగా వ్య క్తం కాకుండ జాగ్రత్త పడ్డాడు . . . "ఒకవేళ చౌదరిగారు నిన్న కనుక అడగ్గానే ఆ పెళ్ళికి అంగీకరించి వుంటే. . ."

"ఈ పాటికి కృషి అమెరికా ప్రయాణానికి సిద్ధమయ్యేదంటావ్" చౌదరి జోక్‌లా నవ్వాడు.

"కనీసం జీవితనే ఓ అమ్మాయి బ్రతికేదిగా"

"మరిచిపో విశ్శు. . . దేనికైనా ప్రాప్తం వుండాలిగా. . . అప్పటికే నేను ఒప్పుకున్నాగా. . . కాకపోతే కాస్త ఆలస్య మైంది. . ." చౌదరి ఈజీగా అనేసాడు.

మరేదో చెప్పేవాడే యింతలో ఎమ్మెల్యే రాజారావు వచ్చి ఓ రహస్యంలా అన్నాడు చౌదరితో "అవతల గదిలో పెద్దమనుషులు మీ కోసం ఎదురుచూసున్నారు సర్."

విశ్శూని పట్టించుకోలేదిక చౌదరి. . .

లోపలికి వెళుతుంటే నిశ్శబ్దంగా చూస్తూ వుండిపోయాడు. . . మరో అర నిముషం తర్వాత బయటికి వెళ్ళబోతుండగా పలకరించాడు రాజేంద్ర "హాయ్ విశ్శూ. . . "

నిన్న ఆత్మహత్య నుంచి తేరుకున్నట్టు కాక ఓ హత్య చేసి తప్పించుకున్న ఉత్సాహంలా వుంది.

చౌదరిలాంటి వ్య క్తిని ఢీకోవాలి అంటే ఓ బలమైన ఆయుధం కావాలి . . . జీవితనే ఓ ఆడపిల్ల జీవితాన్ని అంత నిర్ధాక్షణ్యంగా కాలరాసిన రాజేంద్ర సుఖంగా బ్రతక్కూడదు... ఈ

దిగమింగుకుని యిలా వచ్చాడు.

అదిగో అప్పుడు చూసాడు యింటి లోపల అడుగుపెడుతున్న డాక్టర్ సక్సేనాని... అతడితో బాటు మరో యిద్దరు పార్లమెంటు సభ్యులు లోనికి వచ్చి లాయర్ రంగధాం సాధరంగా ఆహ్వానిస్తుంటే లోపలి గదిలోకి వెళ్ళారు.

డాక్టర్ సక్సేనా అంటే ప్రపంచ ఆరోగ్య సంస్థలో భారతదేశానికి చెందిన పర్యావరణ సంఘానికి ప్రతినిధి. . . ఇక్కడి కెందుకొచ్చాడు . . .

కేంద్ర మంత్రిగారు రాజేంద్రకి మామ కాబోతున్న సందర్భంలో యిలాంటి ప్రముఖులు యిక్కడ అడుగుపెట్టడంలో ఆంతర్యం అర్థం కావడం లేదు విశ్వాకి.

రాజేంద్ర ద్వారా తప్ప విషయాన్ని రాబట్టే మార్గం లేనట్టుగా విశ్వ రాజేంద్రని రెచ్చగొట్టి పార్టీకోసమన్నట్టుగా ఓ ఫైవ్‌స్టార్ హోటల్ రెస్టారెంట్‌కి తీసుకువెళ్ళాడు.

అతిగా తాగేక రాజేంద్ర ఎంత వాగేది అర్ధమైన విశ్వ మొత్తం విషయాన్ని రాబట్టగలిగాడు. ఇక్కడ రాజేంద్రకి తెలీనిది విశ్వ ఇప్పుడు తన తండ్రి హత్యలో చౌదరిని అనుమానిస్తున్నాడన్న విషయం.

"ఇందాక నువ్వు చూసింది డాక్టర్ సక్సేనా ఒక్కడ్నే విశ్వా. . . అంతకుముందే మా యింటిలో అతడికోసం వెయిట్ చేస్తున్న వ్యక్తి లక్నోకి చెందిన ఇండస్ట్రియల్ టాక్సికాలజీ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ సైంటిస్ట్ డాక్టర్ మోహతా.."

"నీ పెళ్ళికి వాళ్ళు రావటానికి సంబంధం ఏమిటి"

"మాకు చాక్‌లెట్ కంపెనీ ఒకటుందని అది దేశంలో ప్రముఖ కంపెనీగా ఎదిగే ప్రోసెస్‌లో యీ మధ్య విదేశాలకు కోట్ల రూపాయల చాక్‌లెట్స్‌ని ఎగుమతి చేస్తూందన్న విషయం నీకు తెలుసుగా . . . ఈ మధ్య ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో మా కంపెనీ చాక్‌లెట్స్‌లో 'నికెల్' వున్నట్టు కనిపెట్టింది. ఆ విషయం బయటపడితే ఎగుమతులు ఆగిపోవడమే కాదు మన దేశంలోనూ చాక్‌లెట్స్ డిమేండ్ తగ్గి కంపెనీ మూసేయాల్సిన పరిస్థితి రావచ్చు. . ."

రాజేంద్ర చెప్పకపోయినా కంపెనీ అధిపతి అయిన చౌదరి జైలుకి వెళ్ళాల్సి వుంటుంది, పసిపిల్లలు తినే చాక్‌లెట్స్‌లో నికెల్ రుచిపెంచే అవకాశం వున్నా అది ప్రాణహాని కలిగించే జబ్బులకి కారణం అవుతుంది.

"ఇది మా డాడీకి తెలిసింది ఈ మధ్యనే. అదీ నాకు కాబోయే మామగారైన కేంద్ర ఆరోగ్యశాఖామంత్రి ద్వారా ప్రపంచ ఆరోగ్య సంస్థ యిప్పటికే హెల్తు మినిస్టర్‌కి రిపోర్టు పంపింది. ఇప్పుడు డాక్టర్ సక్సేనా డాక్టర్ మెహతాలు ఇంతవరకూ ఉత్పత్తయిన మా చాక్‌లెట్స్‌లో నికెల్ లేదని లేబరేటరీస్‌లో నిరూపించాలి. దానికి సంబంధించిన లావాదేవీలు మాట్లాడటానికే వాళ్ళు మా ఇంటికి వచ్చింది. "వాళ్ళని పంపింది నాక్కాబోయే మామగారే - వాళ్ళు మాకు సహకరిస్తే దానికి బదులుగా నేను కేంద్ర ఆరోగ్య శాఖామంత్రికి అల్లుడ్ని కావాలి. . . అదీ సంగతి . . ."

అభినందనగా రాజేంద్ర భుజం తట్టాడు విశ్వ. అలా అభినందించింది మంత్రిగారికి అల్లుడవుతున్నందుకు కాదు ఓ అద్భుతమైన 'క్లూ' అందించినందుకు. . .

ఇక్కడ రాజేంద్ర మొత్తం కక్కేసి ఎంత పొరపాటు చేసిందీ ఆ మరుసటి రోజుకిగానీ అర్థం కాలేదు.

ఆ మరుసటి రోజే విశ్వ హోటల్ ఎమరాల్డులో ఓ ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటుచేశాడు. ఆ కాన్ఫరెన్స్‌కి వినియోగదారుల సంఘం ప్రతినిధుల మహిళా సంఘాలతో బాటు పౌరహక్కుల సంఘం నాయకుల్నీ ఆహ్వానించాడు.

అంతే. . .

ఏదైతే గోప్యంగా జరగాలని చౌదరి ప్రయత్నించాడో అది కాస్త పత్రికలదాకా వెళ్ళడంతో బాటు 'చౌదరి చాక్‌లెట్స్ గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో తేల్చిన వాస్తవాల్ని ప్రభుత్వం ఎందుకు నొక్కిపెడుతుంద'ని పార్లమెంటులో సైతం చర్చించబడింది మరునాడే.

కోట్లాది మంది పసిపిల్లల ప్రాణాలకు హాని కలిగించే చౌదరి చాక్‌లెట్స్ గురించి ప్రయోగశాలలో పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని ప్రతిపక్షాలకు హామీ యిచ్చాడు దేశ ప్రధాని.

ఒకేసారి సెంట్రల్ ఫుడ్ లేబరేటరీస్, హైద్రాబాద్‌కి చెందిన కేంద్ర పౌష్టికాహార సంస్థ, మైసూర్‌లోని డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లేబరేటరీలలో చాక్‌లెట్లలో 'నికెల్' శాతం గురించి తెలుసుకొమ్మని స్వయంగా ప్రధానమంత్రే ఆదేశాలిచ్చాడు.

కేవలం నాలుగురోజుల వ్యవధిలో రామనాథ చౌదరికి చెందిన సగం సామ్రాజ్యం సమస్యల్లో చిక్కుకుంది. అంతేకాదు కాబోయే పెళ్ళి సైతం నిరవధికంగా వాయిదా పడిపోయింది.

ఒక అణువు విస్ఫోటనం ఎలాంటి భీభత్సానికి కారణమయ్యిందీ తెలిసిన చౌదరి వెంటనే తల బలగానికి ఆదేశాలిచ్చాడు.

ఇరవై నాలుగు గంటల్లో విశ్వ కడతేరిపోవాలి.

ఆ విషయం ముందు తెలుసుకున్నది కృషి.

పత్రికల, రేడియో, దూరదర్శన్‌ల ద్వారా విశ్వ ఒంటరిగా సాగిస్తున్న పోరాటం గురించి తెలుసుకుంటూ అమితమైన ఆనందంతో బాటు అనూహ్యమైన టెన్షన్‌కి గురైన కృషి విశ్వని కలుసుకునే ప్రయత్నంలో విఫలమైంది మొదటి ఆరు రోజులు.

ఆ తర్వాత ఓ అర్ధరాత్రి అతడ్ని కలుసుకుంది ఆశ్రమంలోనే.

మాసిన గెడ్డంతో కనిపించిన విశ్వ ఇప్పుడు యోధుడిలా అనిపించలేదు.

ఓ యజ్ఞం ప్రారంభించిన రుషిలా వున్నాడు.

ఆమెను చూడగానే ముందు అవాక్కయ్యాడు.